సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 24 । జూలై । 2023



వసతి భళా..

సంక్షేమ వసతి గృహాల్లో చక్కటి వసతులు కనిపిస్తున్నాయి. నాడు–నేడుతో అభివృద్ధి చేస్తున్నారు. - 8లో



రక్షించేందుకు వెళ్లి..

పొందూరులో విద్యుత్ తీగలు తాకి ఓ యువకుడు మృతి చెందాడు. రక్షించేందుకు వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. - 8లో

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ సోమవారం ఉదయం 8 గంటల నుంచి అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నట్లు ఈవో వి.హరి సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపెద్దలు, రెవెన్యూ, పోలీస్, దేవదాయ శాఖ జిల్లా అధికారుల పర్యవేక్షణలో హుండీలను తెరిపించి, లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు. భక్తులు కూడా పాల్గొనవచ్చునని తెలిపారు.

న్యూస్‌రీల్

స్పీకర్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ గొండు



స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కృష్ణమూర్తి

గార: డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన గొండు కృష్ణమూర్తి ఆదివారం స్పీకర్ తమ్మినేని సీతారాంను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అనుభవం గల వ్యక్తిగా నాణ్యమైన సేవలు అందించాలని స్పీకర్ సీతారాం డీసీఎంఎస్ చైర్మన్‌కు సూచించారు.

అర్ధరాత్రి లాడ్జీల్లో తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్: అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే శక్తులకు ఎలాంటి పరిస్థితుల్లో వసతి కల్పించరాదని లాడ్జి యజమానులకు సీఐ పి.శ్రీనివాసరావు హితవు పలికారు. నగరంలోని రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని లాడ్జిలను శనివారం అర్ధరాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా చేసేవారికి, జూదం ఆడేవారికి, ఇతర సంఘ విద్రోహ శక్తులకు వసతి కల్పించరాదని తెలిపారు. కస్టమర్ల ఆధార్ కార్డును క్షుణ్ణంగా పరిశీలించాక రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

అక్టోబర్ 17 నుంచి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు అక్టోబర్ 17 నుంచి 19వ తేదీ వరకూ మూడురోజులపాటు నిర్వహించడానికి దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఆలయ ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా మహాలయ అమావాస్య అనంతరం వచ్చే మంగళవారం నుంచి గురువారం వరకూ మూడు రోజులు పాటు శ్రీకొత్తమ్మ తల్లి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి కూడా లక్షల సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాలకు వస్తుంటారు. గత ఏడాది 5 లక్షలకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు భారీగా ఏర్పాట్లు చేసేందుకు ఆలయ కమిటీ ప్రణాళికలు రూపొందిస్తోంది. త్వరలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ కాల్ల సంజీవరావు ఆధ్వర్యంలో ముందస్తుగా సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఆలయ ఈఓ వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు.

ప్రత్యామ్నాయ ఆదాయంపై ప్రత్యేక దృష్టి



టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎండీ ద్వారకాతిరుమలరావు

టెక్కలి: ఆర్టీసీలో టికెట్ ఆదాయంతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు వెల్లడించారు. టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్, డిపోను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావుతో పాటు డీఎస్పీ బాలచంద్రారెడ్డి తదితరులు ఎండీకి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఓఎస్ 15 పథకం ద్వారా తక్కువ డిపాజిట్‌తో తాత్కాలిక కట్టడాలతో ఆర్టీసీ స్థలాలను అద్దెకు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించామని ఎండీ పేర్కొన్నారు. అలాగే కొత్తగా 10 వేల బస్సులను నవీకరణ చేశామన్నారు. వీటితో పాటు 1500 సాధారణ బస్సులు, వెయ్యి ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయన్నారు. గతంలో ఆర్టీసీలో కారుణ్య నియామకాలు ద్వారా కేవలం ఆర్టీసీలోనే ఉద్యోగాలు ఇచ్చేవారని ప్రస్తుత ప్రభుత్వంలో ఇతర శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చే విధంగా మార్పులు తీసుకువచ్చారని, ఇప్పటికే 884 పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామని ఎండీ గుర్తు చేశారు. అలాగే ఒడిశా ప్రాంతంలో ఏపీ బస్సులు తిరిగే విధంగా ఆయా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. గతం కంటే ఆర్టీసీ బస్సు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు.



ఆరోగ్యమస్తు



టెక్కలిలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఆయన పేరు షేక్ అమీర్. నాలుగేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో మంచాన ఉన్నారు. మందులు కొనుక్కోవడానికి కూడా డబ్బుల్లేని దీన స్థితి. ఫ్యామిలీ డాక్టర్ పుణ్యమా అని నెలకు రెండు సార్లు వైద్యులు, వారానికి రెండు సార్లు వైద్య సిబ్బంది ఆయన ఇంటికే వెళ్లి చికిత్స అందిస్తున్నారు. మందులన్నీ పూర్తి ఉచితంగా ఇస్తున్నారు. ఇంత కంటే తనలాంటి పేదలకు కావాల్సింది ఏముంటుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



ఈమె పేరు బూరాడ అమ్మడమ్మ. జి.సిగడాం మండలంలోని వాండ్రంగి గ్రామం. ఎనిమిదేళ్లుగా ఈమె అనారోగ్యంతో బాధ పడుతున్నా ఊరి నుంచి బయటకు వెళ్లి చికిత్స చేయించుకోలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దయ వల్ల ఆమె ఇంటి వద్దకే వచ్చి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి ఆమెతో మాట్లాడి ధైర్యం చెబుతున్నారు. తమ ఊరి డాక్టర్లు యశ్వంత్, హరితశ్రీలు దేవుళ్లలా తనకు సేవలు అందిస్తున్నారని, ఇలాంటి సదుపాయం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలని ఆమె చెబుతున్నారు.



ఈ పెద్దాయన పేరు బొబ్బిలి తమ్మయ్య. ఇచ్ఛాపురం మండలం కీర్తిపురం గ్రామానికి చెందినవారు. నాలుగు నెలల కిందటి వరకు పక్షవాతంతో పాటు షుగర్, బీపీ ఉండేవి. కార్పొరేట్ ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేదు. ఆపై చికిత్స చేయించడం తలకు మించిన భారం కావడంతో వదిలేశారు. అదే సమయంలో ప్రభుత్వం ప్రారంభించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఆయన పాలిట ప్రాణదాతగా నిలిచింది. డాక్టర్ భేరి భార్గవి తమ్మయ్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి వారం చికిత్స చేస్తూ ఉచితంగా మందులు అందజేయడంతో ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు.

ప్రభుత్వం దీర్ఘాయుష్మాన్ భవ అని దీవిస్తోంది. కష్టాల కొలిమిలో పడి సగానికి అరిగిపోయిన సామాన్యుడి ఆయుష్షు రేఖలకు కొత్త ఊపిరి అందిస్తోంది. నిరుపేద నుదుటిపై ముద్రించేసిన దురదృష్టపు రాతలను చెరిపేస్తోంది. ఇంటి అవసరాల కోసం మధ్య తరగతి మనిషి తాకట్టు పెట్టేసిన ఆరోగ్యాన్ని తిరిగి అందిస్తోంది. సగటు జీవిని బతుకంతా భయపెట్టిన ఓపీ రోదులు, గంటల కొద్దీ క్యూలు, లక్షల్లో ఫీజుల ఊసు లేని ఉచిత వైద్యాన్ని ఇంటి వద్దకు తెచ్చి ఇస్తోంది. సామాన్యుల కోసం వైఎస్ జగన్ సర్కారు ఫ్యామిలీ డాక్టర్ అనే వినూత్న విధానానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఈ కార్యక్రమం విజయవంతంగా అమలవుతూ వేలాది మంది ఆరోగ్యాలను బాగు చేస్తోంది.



నరసన్నపేట హడ్కో కాలనీలో ఇంటి వద్దే రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా సేవలు పొందిన వారి వివరాలు..	
మొత్తం సందర్శించిన వారి సంఖ్య	4,06,438
సాధారణ ఆరోగ్య ఓపీ పరీక్షలు, మందులు పొందిన వారు	2,41,548
కౌమార బాలికలకు పరీక్షలు	589
యాంటీనేటల్ కేర్ పరీక్షలు	22316
బాలింతలకు ఆరోగ్య పరీక్షలు (పిఎన్‌సి)	12388
రక్తహీనత పరీక్షలు (ఎనీమియా)	1505
రక్తపోటు (బీపీ)	55045
మధుమేహం (షుగర్)	30121
బీపీ, షుగర్ రెండూ ఉన్న వారు	39953
నోటి క్యాన్సర్	647
రొమ్ము క్యాన్సర్	410
గర్భాశయ క్యాన్సర్	716
టీబీ (క్షయ)	1200



ఇదీ మార్పు

- జిల్లాలో విజయవంతంగా 'ఫ్యామిలీ డాక్టర్' అమలు
- ఇంతవరకు 2.41 లక్షల ఓపీ కేసులు పూర్తి
- 594 వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్స్‌లో ఈ విధానం అమలు
- జిల్లాలో అందుబాటులో 142 మంది వైద్యులు
- 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులతో చికిత్స

అరసవల్లి: ఊరికి ఊపిరి వచ్చింది. ఇన్నాళ్లూ ఆస్పత్రులకు వెళ్లలేక ఇంటికే పరిమితమైన నిరుపేదవృద్ధులు, మధ్య వయస్కులకు ఉన్న వీధిలోనే మంచి వైద్యం అందుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూపొందించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) తీసుకువచ్చిన మార్పు ఇది. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి మొబైల్ మెడికల్ యూనిట్ (104) వాహనాల ద్వారా ఓపీ వైద్యాన్ని, ఉచితంగా పరీక్షలు, మందులు ఇచ్చే ప్రక్రియను కూడా ఇందులో భాగం చేశారు. మన జిల్లాలో గత ఏడాది అక్టోబర్ 21 నుంచి నేటి వరకు ఈ విధానం దిగ్విజయంగా కొనసాగుతోంది. ఈ పద్ధతి ద్వారా జిల్లా వ్యాప్తంగా 71 పీహెచ్‌సీల పరిధిలో ఈ ఉచిత సర్వీసులను 4,06,438 మంది వినియోగించుకోగా.. వీరిలో సాధారణ ఆరోగ్య ఓపీ చూపించుకున్నవారు 2,41,548 మంది వరకు ఉన్నారు.

క్షేత్ర స్థాయిలో ఇలా..

జిల్లాలోని 30 మండలాల్లో ఉన్న 71 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పరిధిలోని 594 వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్స్ పరిధిలోని గ్రామాల్లో ఈ ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ అమలవుతోంది. పీహెచ్‌సీలో 14 మంది సిబ్బందితో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉన్నారు. జిల్లాలో 51 మొబైల్ మెడికల్ యూనిట్..(104 వాహనాల) సేవలను ఈ ఎఫ్‌పీసీ విధానం అమల్లో భాగస్వామ్యం చేయడంతో ఓపీ సేవలకు మంచి రెస్పాన్స్ వస్తోంది.



జి.సిగడాం మండలం చీడిపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

- సగటున రోజుకు 50 నుంచి 60 వరకు రోగులు ఈ శిబిరాలకు హాజరవుతున్నారు.
- పీహెచ్‌సీ పరిధిలో సచివాలయం వద్దనే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ చూస్తున్నారు.
- అక్కడే బీపీ, సుగర్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు.
- భోజన విరామం అనంతరం సాయంత్రం 4 గంటల వరకు ఆయా పీహెచ్‌సీ వైద్యునితో పాటు ఆశ వర్కర్, ఏఎన్ఎం, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ బృందంగా ఇంటిలో మంచానికే పరిమితమైన రోగులను పరీక్షిస్తున్నారు.
- ఈ క్రమంలో మెరుగైన వైద్యం అవసరం ఉంటే రిఫర్ చేయడం.. ఇలా వారి ఆరోగ్యం బాగయ్యేంత వరకు ఫాలోఅప్ చేస్తున్నారు.
- ఇక 104 వాహనం ఓపీ వద్ద 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 105 రకాల మందులు నెల రోజులకు సరిపడా ఉచితంగా అందించేందుకు అందుబాటులో ఉంచుతున్నారు.



- బీపీ, షుగర్‌తో పాటు క్యాన్సర్, హృద్రోగం, టీబీ తదితర పరీక్షలను కూడా నిర్వహించి, ఉచితంగా మందులు ఇస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఉన్నత వైద్యానికి రిఫర్ చేయనున్నారు.

అద్భుత ప్రోగ్రాం



ప్రజలకు నేరుగా సేవలందించేందుకు దేశ చరిత్రలోనే మన రాష్ట్రంలో తొలిసారిగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) విధానం అద్భుతమైన ప్రోగ్రాం. వైద్యవృత్తిని ఎంచుకున్న వారికి అద్భుత సేవామార్గం. ఆన్‌లైన్ చేయడంతో ఎక్కడ ఏ సేవలందిస్తున్నారో.. ఎవరికి మందులు ఎన్ని ఇస్తున్నారో కూడా పూర్తి వివరాలు తెలుస్తున్నాయి. జిల్లాలో 71 పీహెచ్‌సీల్లో 142 మంది వైద్యులు ఈ సేవలకు అందుబాటులో ఉన్నారు. స్థానిక రోగులకు ఉచిత పరీక్షలు, ఉచిత మందులు ఇవ్వడంతో పాటు ఇంటికే పరిమితమైన రోగుల పరిస్థితులను ఫాలోఅప్ చేయడమే ప్రధాన లక్ష్యం. అయితే ప్రతి సేవపై పర్యవేక్షణ ఉంటుంది. **– డాక్టర్ లక్ష్మి తులసి, ఎఫ్‌పీసీ నోడల్ ఆఫీసర్**

బీపీ అదుపులోకి వచ్చింది



నాకు బీపీ వచ్చింది. ఇంట్లో వారిని వెంట పెట్టుకుని పెద్ద ఆస్పత్రులకు పరీక్షలకు వెళ్లి మందులు తెచ్చుకునేదాన్ని. ఇప్పుడు వీధిలోకి మా డాక్టర్ హరితమ్మ వస్తున్నారు. పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. జాగ్రత్తలు చెప్పారు. ఇప్పుడు బీపీ అదుపులోకి వచ్చింది. డాక్టర్లు ఇంటికి రావడం.. మాతో మాట్లాడటం..మందులివ్వడం.. వంటివి ముందెప్పుడూ చూడలేదు. వినలేదు. **– సింహాద్రి రమణమ్మ, జి.సిగడాం**

మనోధైర్యం ఇస్తున్నారు



నేను, నా భార్య ఇద్దరం కొంతకాలంగా ఇంటికే పరిమితమయ్యాం. బీపీ షుగర్‌లతో పాటు ఇతరత్రా ఇబ్బందులుండేవి. వైద్యం కోసం సోంపేట, పలాస, బరంపురం కూడా వెళ్లేవాళ్లం. ధర ఎక్కువైనా మందులు తప్పనిసరిగా కొనుక్కునేవాళ్లం. అయితే ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్‌గా మా ఇంటికి కూడా ప్రభుత్వ డాక్టర్లు వస్తున్నారు. మా ఆరోగ్య యోగక్షేమాలను అడిగి.. కాసేపు ఆప్యాయంగా మాట్లాడేవారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా ఉచితంగానే మందులు ఇచ్చారు. ఇదే మాకు ఎంతో మనోధైర్యాన్నిచ్చింది. ఇప్పుడు కాస్త ఆరోగ్యం మెరుగుపడింది. **– ఉప్పాడ చంద్రయ్య, పాతకొజ్జీరియా, కవిటి మండలం**

మరణంలోనూ వీడని పేగు బంధం

- గుండె పోటుతో తల్లి మృతి
- తట్టుకోలేక ఆగిన కుమారుడి ఊపిరి
- రాజాంలో విషాదం



మృతి చెందిన తల్లీ కుమారుడు కురమమ్మ, అమర్ (ఫైల్)

రాజాం సిటీ, కాశీబుగ్గ: అమ్మ కన్నుమూసిన కాసేపటికే కొడుకు కూడా ప్రాణాలు వదిలేశాడు. తల్లి మరణవార్త విని ఆ కొడుకు గుండె ఆగిపోయింది. కాశీబుగ్గలో తల్లి చనిపోగా.. ఆ వార్త విని ఏలూరులో కొడుకు కన్నుమూశాడు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా రాజాం పట్టణానికి చెందిన యందవ కురమమ్మ(50) పలాస ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త ఆర్టీసీలోనే ఉద్యోగం చేస్తూ రెండేళ్ల కిందట చనిపోయారు. దీంతో ఆమె పలాస ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధుల్లో చేరారు. పలాస–కంబాలరాయుడు పేట పల్లెవెలుగు బస్సులో విధుల్లో చేరేందుకు ఆర్టీసి డిపోలో ముందు రోజు రాత్రి మహిళా విశ్రాంతి గదిలో సేద తీరారు. ఆదివారం ఉదయం 6 గంటలకు విధుల్లో చేరేందుకు సిద్ధం కాగా ఛాతీలో నొప్పి రావడంతో ఆర్టీసీ తోటి ఉద్యోగులు పలాస ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ డిపో మేనేజర్ సీతారాంనాయుడు, అసిస్టెంట్ డిపో మేనేజర్ పి.సంతోష్ కుమార్ ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకొని మృతదేహాన్ని ప్రత్యేక బస్సులో రాజాం తరలించారు. ఆమె మృతి చెందిన విషయం రాజాంలోని మెంటిపేట ఎస్సీ కాలనీలో ఉన్న బంధువులకు తెలియడంతో విషాదంలో మునిగిపోయారు.

తల్లి వెంటే తనయుడు

యందవ కురమమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు యందవ అమర్ (24) ఏలూరులో ఆర్‌సీఎం చర్చిలో ఫాస్టర్ శిక్షణ పొందుతున్నాడు. తల్లి మరణవార్త తెలియగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అప్రమత్తమైన స్థానికులు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ విషయం కూడా రాజాంలోని బంధువులకు తెలియడంతో ఆయన మృతదేహం తీసుకువచ్చేందుకు అక్కడకు పయనమయ్యారని స్థానికులు తెలిపారు. తల్లి మరణవార్త తెలియగానే కుమారుడు కుప్పకూలిపోయి మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. వీరిద్దరి విడదీయరాని పేగు బంధం పలువురిని కంటతడి పెట్టించింది.

జిల్లాకు చేరిన ఈవీఎంలు



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, డీఆర్వో మురళీకృష్ణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం)లు చేరుకున్నాయి. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఈవీఎంల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక భవనంలో వీటిని భద్రపరిచారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈవీఎంలు గోడౌన్ ఖరారు చేశారు. విశాఖపట్నం కలెక్టరేట్ నుంచి 1,440 బ్యాలెట్ యూనిట్లు (బి.యులు), 2,100 కంట్రోల్ యూనిట్లు (సి.యులు)వచ్చాయి. రెండు రోజుల్లో మరో ఏడువేల వీవీ ప్యాడ్లు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 2,342 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలను నియమించామని, బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు చేర్పులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలిటికల్ పార్టీలు కూడా బూత్ లెవెల్ ఏజెంట్స్‌ను ఏర్పాటు చేశారని, అందరూ సహకరించాలని తెలిపారు. ఈవీఎంల స్వీకరణ ప్రక్రియకు వివిధ పార్టీల ప్రతినిధులు రౌతు శంకరరావు (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), బొకర నారాయణ రావ్, (బీఎస్పీ), పి.ఎం.జె బాబు (టీడీపీ), ఇప్పిలి సీతారాజు (బీజేపీ) హాజరయ్యారు.

'భవిత'కు బంగారు బాట



భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

- విభిన్న ప్రతిభావంతులకు 30 భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ
- వారి చదువుకు, ప్రయాణానికి, సంరక్షకులకు ప్రత్యేక అలవెన్సులు
- పర్యవేక్షిస్తున్న సమగ్ర శిక్షా అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విభిన్న ప్రతిభావంతుల బోధన, శిక్షణపై ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. భవిత కేంద్రాలు వేదికగా వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శారీరక, మానసిక థెరపీ అందిస్తూ, వారిలో చైతన్యాన్ని తీసుకుని వచ్చేందుకు భవిత కేంద్రాలు ఎంతో కృషి చేస్తున్నాయి. సమగ్రశిక్షా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ ఆదేశాల మేరకు సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు నేతృత్వంలో ఐఈఆర్టీలు, సిబ్బంది అర్హులైన విభిన్న ప్రతిభావంతులను గుర్తించే పనిలో నిమగ్నమై ఉన్నారు.

ఎన్నో సేవలు, మరెన్నో అలవెన్సులు..

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వివిధ సేవలు, అలవెన్సులను ప్రభుత్వం అందిస్తోంది. ప్రస్తుతం విభిన్న ప్రతిభావంతులైన బాలబాలికలకు యునిక్ డిజేబులిటీ ఐడెంటిటీ (యుడీఐడీ)కార్డులను తయారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. సదరం సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ రాయితీలు అందాలంటే ఈ గుర్తింపు కార్డు తప్పనిసరని అధికారులు చెబుతున్నారు. తీవ్రమైన వైకల్యం ఉన్న పిల్లలను గుర్తించి ఎన్‌సీఈఆర్టీ తయారుచేసిన 'ఎసెస్ట్' అనే యాప్‌లో సైంటిఫిక్ ఐడెంటిటీలో గుర్తించి బడుల్లో వివరాలు నమోదు చేస్తున్నారు. స్పెసిఫిక్ లెర్నింగ్ డిజేబులిటీ భవిత కేంద్రాలకు తీసుకుని వచ్చేందుకు తల్లిదండ్రులు/సంరక్షకులకు ప్రభుత్వం అలవెన్సులు అందజేస్తోంది. రవాణా, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, ఎస్కార్ట్, రీడర్, బాలికా విద్య స్టైపెండ్ పేరుతో ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఒక్కో విద్యార్థికి నెలకు రవాణా అలవెన్సు కింద రూ.300, హోమ్ బేస్డ్ అలవెన్సుగా రూ.300, ఎస్కార్ట్ అలవెన్సుగా రూ.300, రీడింగ్ అలవెన్సుగా రూ.600, గర్ల్ ఎడ్యుకేషన్ స్టైఫండ్ కింద నెలకు రూ.200 చొప్పున నిధులు విడుదల చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షా నిర్వహిస్తున్న 30 భవిత కేంద్రాల ద్వారా సేవలు పొందుతున్న విభిన్న ప్రతిభావంతులు, పాఠశాలల్లో చదువుతున్న వారికి ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాలు అందిస్తోంది. చైల్డ్ ఐడీ ఆధారంగా అర్హుల ఖాతాల్లో రాష్ట్ర పథక కార్యాలయం నుంచి ఈ అలవెన్సులను ప్రభుత్వం జమ చేస్తోంది. గడచిన విద్యా సంవత్సరానికి సంబంధించి రూ.63.28 లక్షలు జమ చేసింది. ఒక్కో విద్యార్థికి 10 నెలలకు రవాణా చార్జీలుగా 540 మందికి రూ.16.20లక్షలు, ఎస్కార్ట్ అలవెన్సు కింద 379 మందికి రూ.11.37 లక్షలు, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ కింద 276 మందికి రూ. 8.28 లక్షలు, రీడర్ అలవెన్సుగా 42 మందికి రూ. 2.52 లక్షలు, బాలికలకు స్టైఫండ్ కింద 1245 మందికి రూ.24.90 లక్షలు చొప్పున చిన్నారుల తల్లుల ఖాతాల్లో జమచేశారు.

ప్రత్యేకంగా ఫిజియోథెరపీ సేవలు..

శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల కోసం ప్రభుత్వం భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్టులను నియమించింది. మరికొంత మంది చిన్నారులు ఇల్లు కదల్లేని పరిస్థితుల్లో ఉంటే, వారానికోసారి సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి అక్కడే ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. గృహ ఆధారిత విద్య ద్వారా ఇలాంటి చిన్నారుల్లో శారీరక, మానసిక పరివర్తన తీసుకువచ్చేందుకు ఫిజియోథెరపీ సేవలు ఎంతో ఉపకరిస్తున్నాయి.

అవకాశాలు వినియోగించుకోవాలి



ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు అందిపుచ్చుకోవాలి. వీరికి భవిత కేంద్రాల్లో సిబ్బంది ప్రత్యేక సంరక్షణ కల్పిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు అన్ని రకాల నైపుణ్యాలు అందించడంలో భాగంగా వివిధ బోధన పద్ధతులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వారం వారం ఇంటికి వెళ్లి శిక్షణ అందిస్తున్నారు.

– బుడుమూరు గోవిందరావు, జిల్లా కోఆర్డినేటర్, సహిత విద్య సమగ్రశిక్షా

అన్ని రకాల సదుపాయాలు..



ప్రభుత్వ పాఠశాలలకు రాలేని దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం భవిత కేంద్రాలు ఏర్పాటు చేసింది. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల్లో ఉన్న లోపాలను సరిచేసి, వారిని సాధారణ పిల్లలతో సమానంగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు. అవసరమైన పరికరాలను అందిస్తున్నాం. ఫిజియోథెరఫీ సేవలతో పాటు అనేక రకాల సౌకర్యాలు, అలవెన్సులు అందిస్తున్నాం. భవిత కేంద్రాల్లో చిన్నారులకు కూడా జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశాం.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్షా ఏపీసీ, శ్రీకాకుళం జిల్లా

క్లుప్తంగా

అడిషనల్ డీజీపీని కలిసిన ఎస్పీ



ఆర్.కె. మీనాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన అడిషనల్ డీజీపీ(గ్రే హౌండ్స్ ఆక్టోపస్) ఆర్కే మీనా, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావులను ఆదివారం ఎస్పీ జి.ఆర్.రాధిక జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మీనాకుయ సాయుధ పోలీసులు గౌరవ వందనాన్ని సమర్పించారు.

తల్లికి తలకొరివి పెట్టిన తనయ



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఉమాదేవి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని వాకలవలసలో శనివారం రాత్రి పైడి తవిటమ్మ (50) గుండెపోటుతో మృతిచెందింది. ఆమె భర్త పైడి రాజారావు కూలి పని కోసం తమిళనాడులోని కోయంబత్తూరులో నివాసం ఉంటున్నాడు. కుమారులు లేరు. దీంతో చిన్న కుమార్తె ఉమాదేవి తల్లి అంత్యక్రియలు పూర్తి చేసింది.

స్వరాజ్యం కోసం గళమెత్తిన యోధుడు తిలక్



తిలక్ విగ్రహం నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: స్వరాజ్య సాధనే జీవిత ధ్యేయంగా పోరాడి ప్రజలను స్వాతంత్ర ఉద్యమం వైపు నడిపించిన ఘన కీర్తి లోకమాన్య బాలగంగాధర్ తిలక్‌దేనని అవధాన పండితులు పైడి హరినాధరావు, గాంధీ స్మారక నిధి రాష్ట్ర సభ్యులు ఎం.ప్రసాదరావు కొనియాడారు. తిలక్ జయంతి సందర్భంగా ఆదివారం శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలోగల గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధులవనంలో తిలక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమాన్ని ప్రజల ఉద్యమంగా మల్చడంలో తిలక్ కీలకంగా పని చేశారని గుర్తు చేశారు. బ్రిటీష్ వారి ఆంక్షలు ఎదిరించి ఎంతో నేర్పుగా వినాయక చవితి ఉత్సవాలను వాడవాడల్లో జరిపించడం ద్వారా స్వాతంత్రోద్యమాన్ని పరుగులు పెట్టించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిరం కమిటీ ప్రతినిధులు జామీ భీమశంకర్, పందిరి అప్పారావు, మెట్ట అనంత భట్లు, కొంక్యాన వేణుగోపాల్, నక్క శంకరరావు, శాస్త్రి, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

దైవనామ స్మరణతో మనశ్శాంతి



ప్రసంగిస్తున్న మందుల మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ మనశ్శాంతితో, తృప్తితో జీవించాలంటే భగవంతుని ప్రార్థన చేయడం ఒక్కటే మార్గమని మందుల మోహనరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో మనశ్శాంతికి మార్గాలపై ఆదివారం ప్రసంగించారు. సత్కార్యాలు చేయడానికి పట్టుదల, దృఢ సంకల్పం ఉండాలన్నారు. అనంతరం వక్తను సత్కరించారు. కార్యక్రమంలో మందిర సభ్యులు పతంజలి శాస్త్రి, వి.కామేశ్వరరావు, ఎం.వెంకటరమణ, పి.వి.ఎస్.ప్రసాద్, విశ్వేశ్వరరావు, సరస్వతి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

వసతి భళా.. హాస్టళ్లకు కొత్త కళ

- వసతి గృహాల్లో ఆధునిక వసతులు
- మార్పు, నాడు-నేడుతో అభివృద్ధి



మార్పు పథకంలో సుందరంగా మారిన నరసన్నపేట సాంఘిక సంక్షేమ వసతి గృహం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమ వసతి గృహాలకు మంచి రోజులు వచ్చాయి. అప్పటివరకు సదుపాయాల లేమితో కునారిల్లిన హాస్టళ్లలో ఇప్పుడు నూతన వసతులు కనిపిస్తున్నాయి. చక్కటి మెనూ, ఆరోగ్యవంతమైన భోజనం, నెలవారీ కాస్మోటిక్ చార్జీలతో పాటు వసతి గృహాలు ఆహ్లాదకర వాతావరణంలోకి మారాయి. గడచిన రెండేళ్లలో మార్పు పథకంతో చాలా వసతి గృహాలకు కొత్త రూపు వచ్చింది. ఈ ఏడాది నాడు-నేడులో భాగంగా మరిన్ని హాస్టళ్లను బాగు చేశారు.

కనిపించేలా మార్పు..

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తక్షణ కర్తవ్యంగా సంక్షేమ వసతి గృహాలకు 'మార్పు' పేరిట నిధులు విడుదల చేసి, వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పించారు.
- ఈ పథకంలో భాగంగా సుమారుగా రూ.5 కోట్లకుపైగా ఖర్చు చేశారు.
- వసతి గృహాల్లో తక్షణ వసతుల కింద మరుగుదొడ్ల మరమ్మతులు, వాటికి సిరామిక్ పలకల ఏర్పాటు, లైటింగ్, ఫ్లోరింగ్, రన్నింగ్ వాటర్ సదుపాయం, ఆధునిక స్థాయిలో స్నానాల గదులు తీర్చిదిద్దడం, పార్కింగ్, కాంపౌండ్ వాల్, రంగులు వేయడం వంటివి చేపట్టారు.
- జిల్లాలో బీసీ సంక్షేమం శాఖలో 81 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 63 వసతి గృహాలు ప్రీ మెట్రిక్ కాగా, 18 పోస్టు మెట్రిక్‌లో ఉన్నాయి. ఈ వసతి గృహాల్లో 52 ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. మిగిలినవి ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నాయి.
- ప్రభుత్వ భవనాల్లో మార్పు పథకం గత రెండేళ్లుగా అమలు చేశారు. వీటిలో భాగంగా 52 వసతి గృహాల్లో 35 వసతి గృహాలకు గాను రూ.3.20 కోట్లు ఖర్చుచేశారు.
- ఎస్సీలో సంక్షేమ శాఖ పరిధిలో 31 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 20 ప్రీ మెట్రిక్ వసతి గృహాలుకాగా, 11 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో మార్పు పథకంలో భాగంగా 21 వసతి గృహాలకు గాను రూ.1.90 కోట్ల వ్యయంతో ఆధునిక వసతులు సమకూర్చారు.

నాడు-నేడులో..

పాఠశాలల అభివృద్ధితోపాటు ప్రభుత్వ వసతి గృహాలకు వసతుల్లో సమూల మార్పులు తీసుకువచ్చి, ఇంటిని మరిపించే విధంగా తయారు చేశారు. ఇప్పటికే ఈ వసతి గృహాల్లో వసతుల పరిశీలన పూర్తయ్యింది. నాడు-నేడుతో అభివృద్ధికి కావాల్సిన నిధులు కూడా సిద్ధమయ్యాయి. ఈ విడతలో ప్రభుత్వ భవనాలు కలిగిన వసతి గృహాలను బాగు చేయనున్నారు. నాడు-నేడు పథకం కింద జిల్లాలో బీసీ సంక్షేమ పరిధిలో 53 వసతి గృహాల్లోనూ, ఎస్సీ సంక్షేమ పరిధిలో 31 వసతి గృహాల్లోనూ పనులు చేపట్టనున్నారు.

మరింత మెరుగుపడతాయి

జిల్లాలో బీసీ సంక్షేమ వసతి గృహాలు మరింత మెరుగుపడతాయి. ప్రభుత్వం నాడు-నేడు పథకాన్ని వసతి గృహాలకు అనుసంధానం చేసింది. నిధుల కోసం కావాల్సిన మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ఇది సంక్షేమానికి మంచి పరిణామం.

– ఇ.అనురాధ, బీసీ సంక్షేమాధికారి

రక్షించేందుకు వెళ్లి.. ప్రాణాలు కోల్పోయి..

- పొందూరులో విద్యుత్ వైరు తెగిపడి యువకుడి మృతి
- విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ



పొందూరు ప్రభుత్వ ఆసుపత్రిలో యువకుడి మృతదేహం



గొర్లె వసంత కుమార్(ఫైల్)

పొందూరు: ఎదురుగా ఉన్న వ్యక్తుల ప్రాణాలకు అపాయం ఉందని గమనించిన ఆ యువకుడు వారిని కాపాడేందుకు వెళ్లి మృత్యువాత పడిన విషాద ఘటన ఆదివారం పొందూరులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరుకు చెందిన రిక్షా కార్మికుడు గొర్లె రాము కుమారుడు గొర్లె వసంతకుమార్(27) ఎచ్చెర్లలో పీజీ పూర్తి చేశాడు. చదువుకుంటూనే డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో పొందూరు ప్రధాన రహదారిలో సిస్టం కళాశాల సమీపంలో వాటర్ సర్వీస్ సెంటర్ వద్ద ఉన్న వసంత్‌కుమార్ ఎదురుగా చికెన్ సెంటర్‌పైన 33బై11 కేవీ వైరు షార్ట్ సర్క్యూట్ జరుగుతున్న విషయాన్ని గమనించి కేకలు వేశాడు. చికెన్‌సెంటర్ వద్దకు పరుగున వెళ్లి అరుస్తుండగానే ఒక్కసారిగా వైరు యువకుడిపై పడింది. విద్యుత్ షాక్ కొట్టడంతో సుమారు 20 అడుగుల దూరంలో పంట పొలంలోకి తుళ్లిపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి విద్యుత్ ఏఈకి సమాచారం ఇచ్చి పొందూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొనఊపిరితో ఉన్న యువకుడిని ఆసుపత్రి సిబ్బంది సీపీఆర్ చేసి బతికించేందుకు ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. వసంత్ ఇకలేడని తెలిసి తల్లిదండ్రులు జయలక్ష్మి, రాము, సోదరుడు శివ సొమ్మసిల్లిపోయారు.

విద్యుత్‌శాఖ అధికారులపై ఆగ్రహం..

విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యమే వసంతకుమార్ మృతికి కారణమని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపించారు. వైర్లు మరమ్మతులు చేయాలని ఏఈ దుర్గాప్రసాద్‌కు కొద్ది రోజుల కిందటే ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.

ఆటో నుంచి జారిపడి వివాహిత మృతి



నూకరత్నం మృతదేహం

పొందూరు: మండలంలోని దళ్లవలస గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస గ్రామానికి చెందిన పంచకర్ల నూకరత్నం(33) మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నూకరత్నం జి.సిగడాంలో ఉంటున్న బంధువుల పరామర్శకు వెళ్లి తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరింది. పొందూరు వైపు నుంచి రాపాక మీదుగా వస్తుండగా దళ్లవలస సమీపంలో నారాయణపురం కాలువ బ్రిడ్జిని దాటుతున్న సమయంలో ఆటో నుంచి జారిపడింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.


ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు రీఅపోర్షన్‌మెంట్ జరిగి 45 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు సదరు ఉపాధ్యాయులు జీతాలకు నోచుకోలేదని, తక్షణమే వారికి జీతాలు అందించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం పీఎస్ఎన్ఎం హైస్కూల్లో జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఈఓ-1, ఎంఈఓ-2లకు సమాన పని విభజనతోపాటు సమాన గౌరవం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నెంబర్ 117 కారణంగా విద్య, ఉపాధ్యాయ రంగం నిర్వీర్యం అవుతుందని, వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు ఎస్‌వి అనిల్‌కుమార్, జి.భీమారావు, పి.అప్పలనాయుడు, చావలి శ్రీనివాస్, వెంకుమహంతి నవీన్ కుమార్, దాసరి రామ్మోహనరావు, సదాశివుని శంకరరావు, పైడి శ్రీరామ్మూర్తి, కే.గోపికృష్ణ, బి.చంద్రశేఖర్, కె.విజయ్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, టి.సూర్యనారాయణ, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

• సైకత జాషువా



ఆధునిక తెలుగు కవి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఆదివారం సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత నివాళులర్పించారు. ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస గ్రామం సమీపంలో ఇసుకతో జాషువా శిల్పాన్ని అందంగా తీర్చిదిద్దారు.

– ఆమదాలవలస రూరల్

రాయితీపై డ్రమ్ సీడర్స్



డ్రమ్ సీడర్లు

లావేరు: రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు 50 శాతం రాయితీపై డ్రమ్ సీడర్స్ అందజేస్తామని ఫౌండేషన్ ప్రతినిధి ఆర్.కృష్ణ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆరుతడి వ్యవసాయ విధానంలో వరి సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహించేందుకు రూ.6600 విలువైన డ్రమ్‌సీడర్‌లను రూ.3 వేలకే అందజేస్తామని చెప్పారు. వివరాలకు 9063351310 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నిస్వార్థ నాయకుడు బొడ్డేపల్లి రాజగోపాలరావు

- విగ్రహావిష్కరణ సభలో స్పీకర్ తమ్మినేని సీతారాం



బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన స్పీకర్ తమ్మినేని సీతారాం తదితరులు

కోటబొమ్మాళి: దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు నిస్వార్థ నాయకుడని, వంశధార ప్రాజెక్టుతో జిల్లాను సస్యశ్యామలం చేశారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం శ్రీజగన్నాథపురం, సరియాబొడ్డపాడు పంచాయతీల సర్పంచ్‌లు, ఉద్యోగులు, గ్రామస్తులు కలిసి పాడుగుపాడులో జాతీయరహదారి పక్కన బిర్లంగి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాన్ని స్పీకర్ ఆవిష్కరించారు. రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభలో స్పీకర్ మాట్లాడుతూ నాడు వైఎస్సార్ హిరమండలంలోని వంశధార రిజర్వాయర్‌కు బొడ్డేపల్లి రాజగోపాలరావు పేరు పెట్టారని, నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి బొడ్డేపల్లి శతజయంతి కార్యక్రమాలకు జీవో జారీచేశారని కొనియాడారు. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన సర్పంచ్‌లు నూక సత్యరాజు, సనపల కృష్ణారావులను అభినందించారు. టీడీపీ నేత కూన రవికుమార్ మాట్లాడుతూ బొడ్డేపల్లి శతజయంతి కార్యక్రమాలకు ప్రభుత్వం జీవో జారీ చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి మాట్లాడుతూ వైఎస్ కుటుంబం బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలకు ఎనలేని గుర్తింపునిచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చింతాడ మంజు, మాజీ ఎంపీపీ ఎస్.రాఘవరావు, పశుసంవర్థక శాఖ అడిషనల్ డైరెక్టర్ యండ సింహాచలం, రిటైర్డ్ న్యాయమూర్తి బొడ్డేపల్లి రామారావు, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, ఎంపీటీసీ సింగూరు వాసు, బగాది దివాకర్, సర్పంచ్‌లు నూక సత్యరాజు, సనపల కృష్ణారావు, జి.కేశవరావు, ఎస్.జనార్దన,బమ్మిడి గణపతి, కవిటి రామరాజు, రాంపాత్ని సావిత్రి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రోణంకి మల్లయ్య, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, బలగ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రతో.. ఫిట్ ఆంధ్ర



ఫిష్‌ఆంధ్ర సూపర్‌మార్కెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: మత్స్యసంపద అభివృద్ధి, యువతకు ఉపాధి, నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫిష్ ఆంధ్రతోనే ఫిట్ ఆంధ్ర సాధ్యపడుతుందని మాజీ ఉపముఖ్యమంత్రి, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోలాకి మండలం చల్లబంద జంక్షన్ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర సూపర్ మార్కెట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రకాలుగా అందిస్తున్న రాయితీలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక యువ రైతు పైల రాజు రూ.20 లక్షల విలువ గల ఈ మార్కెట్‌ను ఏర్పాటుచేశారు. దీనికి 60 శాతం రాయితీ అందించటంతో రాష్ట్రంలోనే మొదటి మెగా ఫిష్ ఆంధ్ర మార్కెట్‌ను నెలకొల్పారు. మత్స్యశాఖ అధికారులు, సిబ్బందికి ఈ ప్లాంట్ వివరాలను రైతు వివరించారు. ప్రతిరోజూ క్వింటా లైవ్ ఫిష్ అందుబాటులో ఉండటంతో పాటు చుట్టుపక్కల ఫిష్ ఆంధ్ర రిటైల్ దుకాణాలకు ఇక్కడ నుంచే లైవ్‌చేపలు సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫిషరీష్ అసిస్టెంట్ గోవిందరావు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జిల్లా మత్స్యశాఖ డీడీ పి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్‌కుమార్, అభివృద్ధి అధికారి సురేష్‌కుమార్, సిబ్బంది ఢిల్లీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

• అ'పూర్వ' సమ్మేళనం



శ్రీకాకుళం మున్సిపల్ హైస్కూల్(ఎన్టీఆర్ పురపాలకోన్నత పాఠశాల)లో 1975-76 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఘనంగా జరిగింది. సుమారు 46 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలిసి ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సందడి చేశారు. – శ్రీకాకుళం కల్చరల్

ముగిసిన అంగన్‌వాడీ మహాసభలు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి

కాశీబుగ్గ: అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పలాసలో రెండు రోజులుగా జరుగుతున్న యూనియన్ జిల్లా 8వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ ఒడి, ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, గ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మీ, ఏపీ ఎన్‌జీఓ అధ్యక్షుడు బోనెల గోపాలరావు, యూనియన్ ప్రతినిధులు డి.సుధ, కె.కళ్యాణి, ఆదిలక్ష్మి, పి.లతాదేవి, ఎస్.హైమవతి, శాంతామణి, జయలక్ష్మి పాల్గొన్నారు.

జీడి రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న తెప్పల అజయ్‌కుమార్

కాశీబుగ్గ: జీడి రైతులు మూడు నెలలుగా నిరసనలు తెలియజేసినా మద్దతు ధరపై ప్రభుత్వం నుంచి సరైన ప్రకటన రావడం లేని జీడి రైతుల సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కాశీబుగ్గలో జీడి రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 కేజీల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించి ఆర్‌బీకేల్లో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న కాశీబుగ్గ బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద జీడి రైతుల 24 గంటల నిరసన సత్యాగ్రహ దీక్ష చేపడతామని ప్రకటించారు. ఇటీవల మృతిచెందిన జీడి రైతు సైని సింహాచలంకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోణారి మోహనరావు, సాతుపల్లి కాంతారావు, అంబటి రామకృష్ణ, బత్తిని లక్ష్మీనారాయణ, రెయ్యి గణపతి, కుత్తుం వినోద్, కుత్తుం ఢిల్లీరావు, లండ భోజరాజు, కొర్లహేమారావు చౌదరి, గొర్ల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ (రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం) క్యాంపస్‌లో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాదికి సంబంధించి ప్రవేశాల కౌన్సెలింగ్ సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మెరిట్ జాబితా మేరకు 1100 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపించారు. వీరంతా ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుంది. దూర ప్రాంత విద్యార్థులు చాలా మంది ఆదివారం సాయంత్రానికి ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు చేరుకోగా, అధికారులు వసతి కల్పించే ఏర్పాట్లు చేశారు. కౌన్సెలింగ్ ఏర్పాట్లను డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు సిబ్బందితో సమీక్షించారు. రాష్ట్ర చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి సోమవారం కౌన్సెలింగ్ పర్యవేక్షణ, ప్రారంభానికి హాజరుకానున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,160-00
బంగారం(22సి. 10గ్రా.)	55,150-00
వెండి (కిలో)	80,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204